విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 13 అక్టోబరు 2025 8 పేజీలు

మున్సిపాల్టీల్లో ఈడీసీ

- నాలాకు బదులు కొత్త విధానం అమలు
- భూమి విలువలో నాలుగు శాతం పన్ను
- ఆ నిధులు పట్టణ అభివృద్ధి ఖర్చు

విశాలాంధ్ర -బ్యూరో ఏలూరు: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చడానికి గతంలో నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్మెంట్) ట్యాక్స్ అమలులో ఉండేది. ప్రజాసౌలభ్యం కోసం దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందట రద్దు చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎటువంటి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్లుగా తయారు చేస్తున్నారు. ఈడీసీ ప్రత్యేక జీవో....నాలా బదులు ఎక్స్ టర్నల్ డెవలప్ మెంట్ చార్జెస్ (ఈడీసీ) విధానాన్ని అమలు చేయాలని గత నెల 3న ఏపీసీఆర్డీఏ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ జిల్లాలో ఇంకా అమలుకు నోచుకోలేదు. ఈడీసీ, జీవో, ప్రకారం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలతోపాటు, గ్రామ పంచాయతీలలో టౌన్ ప్లానింగ్ చట్టం 1920 కింద అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కన్వర్షన్ పొందిన భూములు 2006 సంవత్సరం జనవరి రెండుకు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది. గతంలో నాలా పన్నులు వసూలు చేస్తే కేవలం రెవెన్యూ శాఖకు నగదు జమ అయ్యేది. దీన్ని బదలాయించాల్సి ఉన్నా ప్రత్యేక అజమాయిషి

▶మిగతా 2లో..

జీఎస్టీ ఉల్లంఘిస్తే
కేసులు నమోదు

ఔషధ నియంత్రణ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి

విశాలాంధ్ర -ఏలూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన జీఎస్టీ పన్ను తగ్గింపులను ప్రతి ఒక్కరు అమలు చేయాల్సిందేనని ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తామని జిల్లా ఔషధ నియంత్రణ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఔషధ నియంత్రణ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం, తణుకు ఔషధ నియంత్రణ అధికారులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చింతలపూడిలో 8 దుకాణాలను తనిఖీ చేయగా విన్‌కేర్, మరొక దుకాణంలోను, ఏలూరులోని స్వాతి మెడికల్స్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించామని, వాటిపై కేసులు నమోదు చేశామని కల్యాణ చక్రవర్తి చెప్పారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఔషధ ధరలకు సంబంధించి 18, 12 శాతం స్లాబ్‌లో ఉన్న మందులను ఐదు శాతం స్లాబ్‌లోకి తీసుకు రావడం జరిగిందని, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులకు పూర్తిగా జీఎస్టీ మినహాయించడం జరిగిందన్నారు. కొన్ని దుకాణాల వారు తమ బిల్లింగ్ ప్రాసెస్‌లో సాఫ్ట్వేర్ అప్డేట్ చేసుకోకుండా వినియోగదాల నుంచి పాత జీఎస్టీనే వసూలు చేస్తున్నారని, వారిపై కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో మిగిలిన అన్ని దుకాణాలను తనిఖీ చేసి, పాత జీఎస్టీ వసూలు చేసే వారిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలు తాము కొనుగోలు చేసిన ప్రతీ ఔషధాలకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, ఔషధాలకు సంబంధించి జీఎస్టీ ఉల్లంఘనలపై 9491063158కు ఫిర్యాదు చేయవచ్చని కళ్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

విద్య, సంక్షేమాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

విశాలాంధ్ర - కొవ్వూరు : తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆదివారం కొవ్వూరు నియోజకవర్గంలో శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. పర్యటన నేపథ్యంలో చాగల్లు, తాళ్లపూడి మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కింద రూ. 4,50,500 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి సవిత వాడపల్లి గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం, మహాత్మా జ్యోతిరావు పూలే (ఎమ్‌జెపి) గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ 'ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి రంగాల్లో

▶మిగతా 2లో..

కొత్త కమిషనర్‌కు
సమస్యల స్వాగతం..

- పారిశుధ్య సమస్యను చక్క దిద్దుతారా..
- రానున్న పుష్కరాలు ఆయనకు సవాలుగా మారనున్నాయా..?

విశాలాంధ్ర- కొవ్వూరు : అన్నీ ఉన్నాఅల్లుని నోట్లో శని అన్న చందాన కొవ్వూరు పట్టణ తీరు వుంది. ఈ నేపథ్యంలో కొత్త కమిషనర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఒకపక్క శానిటరీ ఇన్స్పెక్టర్ లేని లోటు, పర్యవేక్షణ కరువు అవడంతో శానిటేషన్ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. 30 సంవత్సరాలు మున్సిపాలిటీలలో వివిధ హెూదాలలో అనుభవం ఉన్న వ్యక్తి కమిషనర్‌గా రావడంతో పట్టణ ప్రజలు అంచనాలు పెంచుకున్నారు. డిపార్ట్మెంట్ పరంగా ఆరు ట్రాక్టర్లు, మరో రెండు అద్దెట్రాక్టర్లు నడుస్తున్నాయి. రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది తగినంత మంది ఉండగా పారిశుధ్య సమస్య పరిష్కారం కావడం లేదు. పట్టణంలో ప్రదాన కూడళ్లు ఆర్డీవో కార్యాలయం, రైల్వే స్టేషన్, ఎల్ఐసి సెంటర్, విజయ విహార్ సెంటర్, బస్టాండ్ సెంటర్లలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. అలాగే డ్రైన్‌లలో సైతం మురుగు నిలిచిపోతుంది. శానిటరీ వర్కర్లు ట్రాక్టర్ డ్రైవర్లుగా, డ్రైవర్లు మేస్త్రిల గా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా జగన్ ప్రభుత్వంలో సచివాలయాల్లో పదిమంది సానిటరీ సెక్రటరీలుగా నియమితులయ్యారు. వీరు ఉదయం ఐదు గంటలకు రావాల్సి ఉండగా ఎనిమిది గంటలకు వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరి కొంతమంది 5:30 కి వేలిముద్ర వేసి ఇంటికివెళ్లి తిరిగి 8 గంటలకు వస్తున్నట్లు

▶మిగతా 2లో..

ఈడీసీ (1వ పేజీ తరువాయి)

లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేది. ప్రస్తుతం ఈడీసీలో మాత్రం నిధులు మొత్తం మున్సిపాలిటీలలోని మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్, బ్రిడ్జిలు, పార్కుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దీనిని అమలు చేసే బాధ్యత ఆయా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల కమిషనర్లకు బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థతో పాటు నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెంతోపాటు ఆకివీడు మున్సిపాలిటీ వున్నాయి. ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండానే వందల ఎకరాల భూములను ప్లాట్లుగా చేసి అధిక సంఖ్యలో లేఅవుట్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో 400కు పైగా లేఅవుట్లు ఉంటాయని అంచనా. నిబంధనల ప్రకారం నాలా చెల్లించని వారు కొత్తగా ప్రవేశపెట్టిన ఈడీసీ చట్టం ప్రకారం పన్నులు చెల్లిస్తే మున్సిపాలిటీలకు అదనంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ చట్టాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కఠినంగా అమలు చేయాల్సి ఉంది.

ఆన్ లైన్‌లోనే...

గతంలో లేఅవుట్లు వేయాలంటే మున్సిపాలిటీలలో దరఖాస్తు చేసుకుంటే సరిపోయేది. కానీ ప్రస్తుతం మాత్రం అన్ని అనుమతులు ఆన్ లైన్ లో ఏపీడీపీఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ డెవలప్మెంట్ ప్లానింగ్ మేనేజ్మెంట్ సిస్టం)కు., దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే సంబంధిత రుసుం చెల్లించాలి. మొత్తం భూమి, వాటి విలువ, ఏ ప్రాంతంలో ఉందనేది అందులోనే పొందుపరచాలి. భూమి విలువలో 4 శాతం ఈడీసీగా చెల్లించాలి. ఇందులో 85 శాతం నిధులు ఆయా మున్సిపాలిటీ ఖాతాలలోనూ, మిగిలిన 15 శాతం అభివృద్ధి అథారిటీకి వెళుతుంది. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకుంటే రెట్టింపు జరిమానా విధిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

విధి విధానాలు రావాలి...

ఈడీసీ విషయమై మున్సిపాలిటీ అధికారులను ప్రస్తావించగా కొత్త చట్టం అమలుపై ఇంకా విధివిధానాలు రావాల్సి ఉందన్నారు. నాలా పేరుతో అనేక వేల ఎకరాల భూమి దుర్వినియోగం అయిందని, ఆ చట్టంలో 10 శాతం పన్ను చెల్లిస్తే ఇందులో కేవలం 4 శాతమే చెల్లించాలన్నారు. దీనివల్ల అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఈ నిధులతో పురపాలక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

సమస్యల స్వాగతం..

(1వ పేజీ తరువాయి)

సమాచారం. మున్సిపాలిటీకి నాలుగు పర్మినెంట్ ట్రాక్టర్లు, రెండు అద్దెకు నడుస్తున్నాయి. ఒక కాంపాక్టు ఉన్నాయి. వీటి ఆయిల్ ఖర్చు కింద నెలకు లక్ష నుంచి లక్షన్నర వరకు ఖర్చవుతుంది. మున్సిపాలిటీకి సంబంధించి డంపింగ్ యార్డ్ లేకపోవడం గమనార్హంగా పేర్కొనవచ్చు. గతంలో డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని మున్సిపాలిటీ కొనుగోలు చేసిన సంబంధిత రైతు కోర్టుకు వెళ్లడంతో అది కాస్త అడ్డం తిరిగింది. ఇక దోమల విషయానికొస్తే చెప్పనక్కర్లేదు. అలాగే వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. ఇటువంటి సమస్యలవలయంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో వచ్చే ఏడాది ఆగస్టు నెలలో గోదావరికి పుష్కరాల వస్తున్నాయి. ఆ సమయానికైనా పరిస్థితులు చక్కబడతాయా లేదా అన్న ప్రశ్న ప్రజలను వెంటాడుతుంది. పుష్కరాల సమయంలో వివిధ రాష్ట్రాల నుంచి సైతం కొవ్వూరు గోదావరి స్నానాలకు వస్తుంటారు. భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. మరోవైపు గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సమీక్షల మీద సమీక్షలు జరుగుతున్నాయి. నిధులకు సైతం కొరత ఉండదని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో కొత్త కమిషనర్ సమస్యలను ఎలాగ అదుపులోకి తెస్తా రోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

17న యువజనోత్సవాలు: కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: జనవరి 12న జరుగు వివేకానంద జయంతి సందర్భంగా జరుగు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యములో యువతకు అనేక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం కలెక్టర్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారిని జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు, అదే విధంగా రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో జరిగే జాతీయ యువజనోత్సవాలకు పంపడం జరుగుతుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను అక్టోబర్ 17న తణుకు ఎస్.కె.ఎస్.డి మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనిలో భాగంగా 15న భీమవరం ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీ అంశాల్లో భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్టన్ డాన్స్ (గ్రూపు) ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అభ్యర్థులు సొంత ఖర్చులతో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పోటీలకు సంబంధించిన వాయిద్య పరికరాలు, అలంకరణలు, తదితర వస్తువులు అన్నింటిని అభ్యర్థులే సమకూర్చుకోవాలన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కాబడిన అభ్యర్థులకు ప్రయాణ, భోజన వసతి సదుపాయాలు అన్ని యువజన సర్వీసుల శాఖ అందించడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొను యువతీ యువకుల వయస్సు 15 నుండి 29 సంవత్సరాలు మాత్రమే ఉండాలని, రాష్ట్రస్థాయి పోటీలు 2025 నవంబర్ నెలలో, జాతీయ స్థాయి పోటీలు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 2026 జనవరి నెలలో ఢిల్లీలో జరుగు జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9441446999, 9490938012, 7075230609 నెంబర్లలో సంప్రదించాలని, జిల్లా స్థాయి యువజనోత్సవాలలో యువతి, యువకులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

(1వ పేజీ తరువాయి)

సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఎమ్‌జెపి గురుకుల పాఠశాలలు స్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. వాడపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. 'మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతోందా? మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా?' అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కావడంతో గురుకుల పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, మరింత మెరుగ్గా పౌర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రయోజనం పొందుతున్నామంటూ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతకు ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేసే క్రమంలో ప్రతి వసతి గృహం, పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సవిత తెలియ చేశారు. విద్యార్థులకు ప్రతి వారం వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడేందుకు కాయిన్ బాక్స్ ఫోన్ సౌకర్యం కల్పించాం" అని తెలిపారు. ఈ సమయంలో కొందరు విద్యార్థులతో ఫోన్ ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడించడం జరిగింది. శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల అంచనాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సమయానుకూల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో రాణి సుస్మిత, బీసీ సంక్షేమ అధికారి బి. శశాంక, ప్రిన్సిపల్ వి ఆనంద్ రాజ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

ప్రమాదాలకు నిలయంగా

రహదారి మలుపులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రహదారులు నిర్మించారు సరే! స్పీడ్ బ్రేకర్లు కూడా నిర్మించండి అని మండలంలో నరసన్న పాలెం, రామానుజపురం, వేదాంతపురం, ధర్మారావుపేట గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలలో, గ్రామాలలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేయడంతో, మండలంలో నరసన్న పాలెం గ్రామం నుండి వేదాంతపురం గ్రామం వరకు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు చొరవతో నిర్మించిన రహదారులు భవనాల శాఖ రోడ్డు కు ఎక్కువ శాతం మలుపులు ఉండటం వలన రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు భయంతో ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయకుండా సంబంధిత అధికారులు రోడ్డును మాత్రమే నిర్మించారని, నూతనంగా నిర్మించిన రోడ్డుపై ఉన్న మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు పీజీఆర్ఎస్ : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు:ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను నేడు సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు.జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో నేటి ఉదయం గం.10నుంచి యధావిధిగా పిజిఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించిందన్నారు.ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్,లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చన్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించు కోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

బాలరాజు నియామకంపై వైసీపీ శ్రేణులు హర్షం

విశాలాంధ్ర-టి.నరసాపురం: పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నియమించడంపై మండల వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టి నరసాపురంలో మాజీ సొసైటీ చైర్ పర్సన్ దేవరపల్లి ముత్యయ్య నివాస గృహం వద్ద ఆదివారం మండల పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ ఎస్విపికెహెచ్ శ్రీనురాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్తగా బాలరాజు నియామకంతో పార్టీ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, కాళ్లీడి సుబ్బారావు, ఎంపిటిసి నార్లపాటి వెంకట్రావు, నాయకులు ఒంటిపల్లి సుబ్రహ్మణ్యం, కటకం మల్లికార్జునరావు, సీతారాం ప్రసాద్ మాదంశెట్టి మల్లయ్య, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీ మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో జరగనున్న కార్తీకమాసోత్సవాల కరపత్రాలను చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తీకమాసోత్సవాలు జరగనున్నాయని, కార్తీకమాస ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ధర్మకర్తల మండలి, ఆలయ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం తెలుగు దేశం నాయకులు పరిమి సత్తిపండు, పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్,రాజాన పండు, బి రాజు పాల్ కుమార్ సిహెచ్ రామలింగేశ్వర రావు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారిణి ఆర్ చందన, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

14న చేతి వృత్తిదారుల జిల్లా సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరంలో 14న జరిగే ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య పశ్చిమగోదావరి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ ఎం.సీతారాం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గం"లకు ఎల్ఐసి ఆఫీస్ రోడ్ గర్ల్స్ హాస్టల్ ఎదురుగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు హాజరవుతారన్నారు. జిల్లాలోని నేత, గీత, మత్స్యకారులు, రజక, నాయి బ్రాహ్మణ, కమ్మరి, కుమ్మరి, పంచకర్మలు, వడ్రంగి, తాపీ , గొర్రెల కాపరి రైతులు, టైలరింగ్ ఇంకా అనేక చేతి వృత్తుల్లో పనిచేసే వారందరూ హాజరై సదస్సును జయప్రదం చేయాలని, మరిన్ని వివరాలకు 7382729337, 9441170494 నెంబర్లలో సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పేకాట శిబిరంపై దాడి...

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలో పేకాట స్థావరంపై చింతలపూడి సిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్నబాబు, పోలీసు సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో 9 మంది పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. వీరు నుంచి రూ14,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనదారులకు గ్రీన్ సిగ్నల్

విశాలాంధ్ర -ఉంగుటూరు :ఉంగుటూరు మండలం నారాయణపురం బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి అయ్యాయి. దీంతో ఆదివారం కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే రాకపోకలు అనుమతించారు. ద్విచక్ర వాహనదారులకు అనుమతి ఇవ్వడంతో ఇబ్బందులు తొలిగాయని వాహనదారుల హర్షం వ్యక్తం చేశారు. వంతెనకు సంబంధించి రైలింగ్ పనులు జరుగుతున్నాయి. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వంతెన నిర్మాణం పనులు పై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసు పనులను పరిశీలించారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో దార్విక్ బ్రాంజ్ మెడల్స్

విశాలాంధ్ర-టి.నరసాపురం: పశ్చిమ గోదావజిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలో మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన బాలుడు భీరం దార్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 2బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు బాలుని తండ్రి భీరం ప్రతాప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం లో 4నుడి 6 సంవత్సరాల వయస్సు గల బాలుర రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న దార్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి రెండు పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. చిన్న వయసులో మంచి ప్రతిభ కనబరిచి విద్యార్ధిని గ్రామస్తులు అభినందించారు.

విద్యతో పాటు నైపుణ్యత సాధించాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర పాలకొల్లు: విద్యార్థులు డిగ్రీ చదువుతున్న సమయంలో పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ కొంత సంపాదనచేసి తల్లి తండ్రులకు సహాయపడాలని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. పాలకొల్లు ఛాంబర్ ఆధ్వర్యంలో ఇంటర్ కళాశాల స్వర్ణోత్సవం, డిగ్రీ కళాశాల 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నూతనంగా నిర్మించిన ఈ-క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యతో పాటు స్థానికంగా ఉన్న వ్యాపార సంస్థలలో, మెడికల్, ఇంజనీరింగ్ వర్క్ షాప్‌లలో పనిచేసి స్కిల్స్ పొందితే, మీరే స్వయంగా వాణిజ్యాధిపతులుగా తయారు కావచ్చన్నారు. పాలకొల్లులో 37 వివిధ రంగాల అసోసియేషన్స్ కలిసి 50 సంవత్సరాల క్రితం తలపెట్టిన విద్యా సంస్థను, అత్యంత సమర్థవంత సంస్థగా తీర్చిదిద్దిన ఛాంబర్ నాయకులకు అభినందనలు తెలిపారు. ప్రస్తుత టీమ్ కారుమూరి నరసింహారావు చైర్మన్‌గా విద్యాసంస్థను నూతన ఒరవడిలోకి తీసుకొచ్చి ఎనలేని అభివృద్ధి చేశారని, నూతన యువ నాయకత్వాన్ని ప్రస్తావిస్తూ ఈ ఛాంబర్ స్థాపించిన విద్యాలయాన్ని ఒక మోడల్ సంస్థగా అభివృద్ధి చేశారని కొనియాడారు. అడిషనల్ చైర్మన్ టి.కృష్ణ మూర్తి, సెక్రటరీ-కరస్పాండెంట్ వెంకట సీతారామ రాజు, ట్రెజరర్ అర్.ప్రవీణ్ భాను, మజీ మునిసిపల్ చైర్మన్ బి.ఉషారాణి, అడబాల రమణ, కొమ్ముల మురళి కృష్ణ, జేపీ తదితరులు పాల్గొన్నారు. నూతన్ నావల్ కేడర్ గౌరవ వందనం రవీంద్ర నాథ్ స్వీకరించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద కుటుంబాల్లో సంతోషం

విశాలాంధ్ర -భీమవరం: జీఎస్టీ పన్నులు తగ్గింపుతో పేద మధ్య తరగతి కుటుంబాల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారని, దీపావళి సందర్భంగా వారికి కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తూ జీఎస్టీ ఫలాలు అందుకోవాలని కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులన్నారు. టిడిపి శ్రేణులు 11,12 వార్డుల్లో ఆదివారం ఇంటింటా తిరిగి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఉప్పులు, పప్పులు ఇతర నిత్యావసరాల ధరలు తగ్గాయని, ఎలక్ట్రానిక్ వస్తువులు మరింత దిగి వచ్చాయన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు అధిక పన్నుల భారం తగ్గి వారికి కావలసిన వస్తువులు సరుకులు కొనుగోలు చేసుకుంటున్నారని తెలిపారు. జీఎస్టీ పన్నులు తగ్గించడంతో ప్రతి ఒక్క కుటుంబానికి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రారంభమైందని గంటా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, నాయకులు యలమంచిలి శ్రీనివాస్, నేదునూరి గంగాధర్ తిలక్, సిహెచ్ తిరుపతయ్య, కోరిపల్లి శ్రీనివాస్, పట్టాభి, కూటమి నాయకులు నాయకులు యాతం శ్రీనివాస్, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బస్సులలో క్లీనర్లను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రైవేటు పాఠశాలల బస్సులలో క్లీనర్లను ఏర్పాటు చేయాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్ధులను పాఠశాలలకు తీసుకువెళ్లి తీసుకువచ్చే బస్సులలో డ్రైవర్లు తప్ప క్లీనర్లు ఉండటం లేదని అందుచేత అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బస్సులలో ఎక్కువమంది విద్యార్థులను కిక్కిరిసే విధంగా ఎక్కించుకొని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల బస్సులలో ఎక్కించుకొని డ్రైవర్లు వారి ఇష్ట నుసారంగా బస్సులను నడుపుతున్నారని, పురవీధులలో ఓవర్‌స్పీడ్‌గా బస్సులు, టాటా మ్యాజిక్‌లు, మినీ బస్సులు నడుపుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ప్రైవేటు బస్సులలో క్లీనర్లను ఏర్పాటు చేసుకోవడానికి ఎందుకనో అలసత్వం వహిస్తున్నారో అర్థం కావడం లేదని విద్యార్థుల ప్రాణాలు అంటే వారికి లెక్క లేవా వారి వద్ద నుంచి అధిక ఫీజులు మాత్రం వసూలు చేస్తున్నారు. సర్వీసు అయిపోయిన పాత బస్సులను కొనుగోలు చేసి విద్యార్థులను పాఠశాలలకు ఎక్కించుకు వెళ్తున్నారని తెలిపారు. విద్యార్థులను ప్రైవేటు బస్సులలో పాఠశాలలకు తీసుకువెళ్లే సమయాలలో కనీసం బస్సు ఎక్కి దిగే మెట్ల వద్ద డోరు కూడా ఉండటం లేదని, బస్సు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా డోర్ వేయాలనే ఆలోచనడ్రైవర్లకు ఉండడం లేదని ప్రైవేట్ పాఠశాలల బస్సులను అధికారులు తనిఖీలు కూడా చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలల ఆవరణ చుట్టూ ప్రహరీ గోడలు కూడా లేక పొలాల మధ్య ఉన్న పాఠశాలల్లోకి పాములు సంచరిస్తున్నాయన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు, మోటార్ వెహికల్స్ అధికారులు ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఆంజనేయరాజు కోరారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర -లింగపాలెం: రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేసేందుకు ఏలూరులో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల నిర్వహించారు. ఈపోటీలలో ధర్మాజీ గూడెంకి చెందిన శిఖా సహస్ర వివిధ విభాగాలలో పథకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఐదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థినీ అండర్-10నుంచి 12 విభాగం లోని రింగ్ 1,2,3లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ విద్యార్థిని తమ్ముడు మూడో తరగతి చదువుతున్న రమేష్ బాబు రోడ్డు-1లో సిల్వర్, రింగ్-1లో కాంస్య పథకాలు సాధించాడు. నాగరాజు, రాధిక దంపతులకు చెందిన ఈ పిల్లలిద్దరూ స్కేటింగ్‌లో చూపిన ప్రతిభకు పలువురు అభినందిస్తున్నారు. కోచ్ ఖాసిం,స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, కార్యదర్శి రమేష్, స్కేటింగ్ పోటీల పరిశీలకులు ఒంగోలుకు చెందిన రాంజీ, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, జిల్లా దళిత సంఘ నాయకులు ముళ్ళపూడి సుమన్, నందిపాం వెంకటేశ్వరరావు, చిన్నారులు చూపిన ప్రతిభను ప్రశంసించారు. చిన్న వయసులో ప్రతిభ చూపిన ఈచిన్నారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని ఆకాంక్షించారు.

ఆనంను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ఆక్వా బోర్డ్ వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డిని కలిసిన ఆక్వా బోర్డ్ డైరెక్టర్ నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామానికి చెందిన మహమ్మద్ నూరుద్దీన్ (మజీద్) మర్యాదపూర్వకంగా విజయవాడలోని అప్పాడ కార్యాలయంలో కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నిడమర్రు మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మొహమ్మద్ గఫర్ ఖాన్, మహమ్మద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర - గణపవరం: శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గణపవరంలోని మహిళా సాధికారత విభాగం అంతర్జాతీయ కౌమారీ దినోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమం చిన్నవయసు పిల్లల హక్కులు, విద్య, సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మాట్లాడుతూ అమ్మాయిలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ముఖ్యమని తెలిపారు. కె.వి. గణేష్ కుమార్, డాక్టర్ జివి రమణ తెలుగు అధ్యాపకులు, తమ ప్రసంగాల ద్వారా విద్యార్థులను లింగ సమానత్వం మహిళల సాధికారత కోసం ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ అనురాధ, పి. బాల మణికంఠ, విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందడం పూర్వ జన్మ సుకృతం

విశాలాంధ్ర- టి.నరసాపురం: ఆంధ్రా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ పొందడం పూర్వ జన్మ సుకృతం అని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. టి నరసాపురం మండలం తిరుమల దేవిపేట పంచాయతీలోని వెంకటాపురం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీలోని రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ పేరేటి ప్రేమానందం పర్యవేక్షణలో పిహెచ్‌డి పరిశోధన పూర్తి చేసి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జిపి రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డు పొందినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి దశ నుండే విద్యార్థి ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలు,సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రా యూనివర్సిటీ నుండి రాజనీతి శాస్త్రంలో పిహెచ్‌డి పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అవార్డు పొందడం దేవుడిచ్చిన గొప్ప వరంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కల్పించిన గొప్ప అవకాశం అని ఆయన తెలిపారు. డాక్టరేట్ అవార్డును సమాజంలోని అణగారిన, పీడిత, బడుగు బలహీన వర్గాలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

నిరసన జయప్రదం చేయండి: వాసుబాబు

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ ఒక కుటీర పరిశ్రమగా అన్ని ప్రాంతాల్లో తయారు చేస్తుందని ప్రజల ప్రాణాలతో ఆడుకుంటుందని వైసీపీ పార్టీ రాష్ట్ర పీఏసి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) ఆదివారం అన్నారు. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా వ్యతిరేకిస్తూ , ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం ఉదయం 9:30 గంటలకు భీమడోలులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ ఏలూరు పార్లమెంట్ ఇంచార్జ్ కారుమూరి సునీల్ కుమార్ పాల్గొంటారని, నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నీట్‌లో విద్యార్థికి 794వ ర్యాంకు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన ఎం పూర్ణసాయి అజయ్‌కి నీట్ పీజీలో 794వ జాతీయ ర్యాంకు సాధించినట్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాజుపోతేపల్లికి చెందిన పూర్ణసాయి ఇంటివద్దే చదివి ఇటీవల జరిగిన నీట్ పీజీ ప్రవేశ పరీక్ష రాసాడు. ఇటీవల విడుదలైన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 794వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ఇంటివద్ద కష్టపడి చదివి ఈ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని పూర్ణసాయి అజయ్ అన్నారు.

1100 సేవలను వినియోగించుకోండి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టర్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం 13న కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను మీకోసం.ఏపి.గవ్.ఇన్ వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ ,పోటీలు

విశాలాంధ్ర జంగారెడ్డిగూడెం : జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు వక్తృత్వం, క్విజ్ పోటీలను కళాశాల ప్రాంగణంలోనే నిర్వహించామని అనంతరం జీఎస్టీపై సమాజానికి అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో విద్యార్థులతో వ్యాపారస్తులకు, పరిసర ప్రాంత ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేయడం జరిగిందని స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు తెలిపారు. జీఎస్టీ నూతన విధానాలను వివరిస్తూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే నినాదంతో ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ విధానాలు సామాన్యులకు సైతం ఊరట కలిగించే విధంగా ఉన్నాయని కొత్త జీఎస్టీ విధానంలో ఏ వస్తువులపై ఎంతెంత పొదుపు చేయగలుగుతున్నామనే విషయాన్ని ప్రజలకు తెలుసుకోవాలని సూపర్ సేవింగ్ జీఎస్టీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా కాలుష్య నివారణలో భాగంగా కళాశాలలో నిర్వహించిన వాహన రహిత రోజును గురించి కళాశాల ఐక్యూ ఏసీ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కోఆర్డినేటర్ డా.ఎమ్. మధు మాట్లాడుతూ రోజువారీ కార్యక్రమాలలో భాగంగా వాహనాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉపయోగి స్తున్నారని ,వాటి వలన కాలుష్యం మరింత పెరుగుతుందని కనీసం నెలలో ఒక్కరోజైనా మన వంతు బాధ్యతగా వాహన రహిత రోజును నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రతి నెలలో రెండవ శుక్రవారం కళాశాలలో వాహన రహిత రోజును నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు ప్రతి నెల రెండవ శుక్రవారం ఎటువంటి వాహనాలను ఉపయోగించడం లేదని నడిచి లేదా సైకిళ్లను ఉపయోగించి మాత్రమే కళాశాలకు హాజరవు తున్నామన్నారు. ఈ కార్యక్రమాలలో కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు సిహెచ్ రమాదేవి, కే వి వి శిరీష, కళాశాల వైస్ ప్రిన్సిపల్, అర్థశాస్త్ర అధ్యాపకులు బి శ్రీనివాసరావు, వి. హనుమంతరావు, ఆంగ్ల అధ్యాపకులు డా.గాళ్ళ. శ్రీనివాసరావు, డా. పి. సన్యాసిరావు, గణిత అధ్యాపకులు డా.సిహెచ్. బదరీ నారాయణ, తెలుగు అధ్యాపకులు డా. జి. వెంకట లాల్, కళాశాలసిబ్బంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్క్రీనింగ్ పరీక్షలు

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లైన్స్‌క్లబ్, ఏలూరు హేలాపురి లైన్స్‌క్లబ్ వారి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన దివ్యాంగుల కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరం జంగారెడ్డిగూడెం లైన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంనకు మొత్తం రాష్ట్రం మొత్తంలో 82 మంది దివ్యాంగులు హాజరు కాగా కృత్రిమ కాళ్ళు ఏర్పాటు కు 62 మంది సెలక్ట్ అయ్యారని 20 మందికి కృత్రిమ కాలు ఏర్పాటు చేసేందుకు వీలు లేకపోవడంతో వారిని ఎంపిక చేయలేదన్నారు. వారిని మరలా పరీక్షించేందుకు తర్వాత జరిగే కార్యక్రమానికి రావలసినదిగా చెప్పడం జరిగిందన్నారు.సెలెక్ట్ అయిన దివ్యాంగులకు 15 రోజుల్లో కృత్రిమ కాళ్లు ఇవ్వబడతాయని జంగారెడ్డి గూడెం ఏజెన్సీ లైన్స్ ప్రెసిడెంట్ దాసరి శేషు కుమార్ కొండపల్లి పండు మద్దిపాటి నాగేశ్వరరావు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నా హనుమంతరావు అట్లూరి సురేష్, పంతగాని వెంకన్న కోటేశ్వరరావు ఖండవల్లి ఆశీర్వాదం మేడిచర్ల రవి తదితరులు పాల్గొన్నారు ఏలూరు లైన్స్ క్లబ్ సభ్యులు లయన్ కె.బి.రావు, కోర్సు శ్రీనివాస్ చలసాని అరుణ్ కుమార్, దేవినేని రమాదేవి, సరస్వతి, వాణి ,కణాల లక్ష్మి కుమారి ఖమ్మం రోటరీ క్లబ్ సభ్యులు రంగారావు సాంబశివరావు స్టాఫ్ పాల్గొన్నారు.

నాయకుల చిత్రాలపై తారు రాసారని

కూటమి నాయకుల నిరసన

విశాలాంధ్ర -మండవల్లి: భైరవపట్నం గ్రామంలో కొత్తగా ఏర్పడిన కాలనీలో నూతనంగా నిర్మించబడిన సిమెంట్ రోడ్ ప్రారంభోత్సవ శిలాఫలకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ చిత్రాలపై తారు రాసి అవమానించారని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం శిలాఫలక చిత్రాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ఇలాంటి పనిచేయటం దారుణమని ఖండించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ వితరణ

విశాలాంధ్ర -ఏలూరు: ఫ్రెండ్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు వృద్ధురాలుకు వీల్ చైర్ వితరణ చేశారు. కవులూరి మహేష్ దంపతులు, శ్రీ శక్తి ప్రసాద్ దంపతులు సంయుక్తంగా వృద్ధురాలు నాగమణికి వీల్‌చైర్ అందజేశారు. అనంతరం ఆమెకు పళ్ళు, వస్త్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

విశాలాంధ్ర -నూజివీడు: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలనుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజీఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల కార్యాలయాలలోనూ, మున్సి పల్ కార్యాలయంలో నేరుగా సమర్పించు కోవచ్చునన్నారు. ఇంటి నుండి ప్రభుత్వ అధికార వెబ్సైట్‌లో ఆన్లైన్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. ఫిర్యాదు నమోదు ఫిర్యాదుల స్థితి, తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేయ వచ్చన్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారు లకు చేరి సమయానుకూలంగా పరి ష్కారం అవుతాయని సబ్ కలెక్టర్ తెలియ జేశారు. కావున ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు.

ఫాదర్ యోహాను సేవలకు సత్కారం

విశాలాంధ్ర-లింగపాలెం: ఆస్ట్రియా దేశంలో మత గురువుగా పనిచేస్తూ స్వదేశంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రంగాపురంకు చెందిన ఆర్.సి.యం సంస్థల మత గురువు కాట్రు యోహాన్‌ను ధర్మాజీగూడెం సీఎస్ఐ చర్చిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ యోహాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశం సించారు. పేదల అభివృద్ధికి పాటు పడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో విదేశంలో కీర్తి గడిస్తున్న యోహాను సేవలు మరువలేనివని చర్చి పాస్టర్ బాబు రవికాంత్, ఫాదర్ గాబ్రియేలు సిఎస్ఐ సంఘ నాయకులు, ప్రశంసించారు. ఈ సందర్భంగా ఫాదర్‌కు సన్మాన పత్రాన్ని బహు కరించారు మహిళలు, యువత, చిన్నారులు లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ సన్మానంలో పాల్గొన్నారు.

దోమల నివారణకు పిచికారి

విశాలాంధ్ర-టి నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత యువ నేత పెండ్యాల అభిషేక్ బాబు ఆర్థిక సహాయంతో దోమల నివారణకు మలాథియాన్ ఆదివారం పిచికారి చేసారు. వర్షాలకు దోమలు వ్యాప్తి చెందడంతో మలాథియాన్ పిచికారి చేయడం పట్ల పలువురు అభిషేక్ బాబు ను అభినందించారు. గత కొంతకాలంగా స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అభిషేక్ బాబు పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమా లతో ముందుకు సాగనున్నట్లు ఆయన తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

విశాలాంధ్ర- దేవరపల్లి : ఆపదలో ఉన్న వారిని ఆదు కోవడంలో జనసేన పార్టీ ముందుంటుందని దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన ఎంపీటీసీ కాళ్ల వెంకటరత్నం జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దావాల శ్రీను జనసేన పార్టీ నాయకుడు దాసరి శేషారావు పేర్కొన్నారు దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొత్తపల్లి ఏడుకొండలు తాపీ పని చేస్తూ పరంజి పై నుండి ప్రమాదవశాత్తు పరంజి విరిగిపోయి పోవడంతో కాలు విరిగిపోయింది దీంతో జనసేన నాయకులు ఏడుకొండలు కు పార్టీ సహాయం అందించాలని ఉద్దేశంతో గ్రామస్తులు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రూ. 16,500ను ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్య క్రమంలో జనసేన పార్టీ నాయకులు కాళ్ళ బుల్లి రాజు, కోనసాగు, బల్ల అయ్యప్ప, గంజి అశోక్, కొత్తపల్లి శ్రీనివాస్, పెంటగంటి బాలకృష్ణ, పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీ సందర్శించిన తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - కడియం : కడియం నర్సరీల అందాలు అద్భుతంగా ఉన్నా యని, ఆయుర్వేద మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేయాలని తెలం గాణ హైకోర్టు న్యాయమూర్తి టి మాధవీదేవి అన్నారు. కడియం మండలం, కడియపులంక శ్రీ సత్య దేవా నర్సరీ ని ఆదివారం తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి టి మాధవీదేవి విచ్చేసారు. వారిని శ్రీ సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు మనీ ప్లాంట్ గోల్డ్ మొక్కతో స్వాగతం పలికారు. మరియు వారికి పుల్లా ఆంజనేయులు లోఫాంథెరా లాక్టెస్సెన్స్ అనే మొక్క గురించి దాని విశిష్టత గురించి వివరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం అందజేత

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం పాత వాటర్ ట్యాంక్ సమీపంలోని పెద్ద చెరువుగట్టుపై నివాసం ఉంటున్న తుమ్మా కాంతమ్మ కు చెందిన తాటాకు ఇల్లు శనివారం రాత్రి అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలు కాంతమ్మకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన 25 కిలోల బియ్యం, నిత్యవసర వస్తువులను కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ చేతుల మీదుగా వృద్ధురాలికి అందజేశారు. ఈ సందర్భంగా గా ఎంపిపి మాట్లాడుతూ సర్వం కోల్పోయి నిరాశ్రయురాలైన వృద్ధురాలికి అన్ని విధాల అండగా ఉండి, ప్రభుత్వం నుండి రావలసిన సహాయం, పథకాలను అందేవిధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రశంస, పొనగంటి శంకర్ పాల్గొన్నారు.

వెంటాడుతున్న ఆలమ్ కొరత

- నిలిచిన తాగు నీటి సరఫరా

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలోని శ్రీ సత్య సాయి త్రాగునీటి పథకం ద్వారా 85 గ్రామాలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. అయితే దీనిలో జీతాలు ఇవ్వడం లేదంటూ కొన్ని రోజుల క్రితం కార్మికులు సమ్మెబాట పట్టి 35 రోజులు పాటు సమ్మె చేశారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇదిలా ఉండగా మూలిగ నక్కపై దాటికాయ పడింది అన్న సామెతలా నీటి శుద్ధికి ఉపయోగించే ఆలమ్ అయిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్ప టికీ మెటీరియల్ రాక పోవడంతో గత నాలుగు రోజులుగా పథకం ఆగింది. ఇది కొత్త ఏమీ కాదు ఇప్ప టికీ ఇది మూడోసారి కాంట్రాక్టర్లు బిల్లు రాక వారు పెట్టబడులు పెట్టక ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నా రన్న విషయం అధికారులకు తెలిసిన ఏమీ చేయలేని పరిస్థితి అధికారులను అడిగితే కాంట్రాక్టర్ ఎన్ని సంవత్సరాలు పెట్టుబడి పెడతాడు కాంట్రాక్ట్ కి పేమెంట్స్ ఇవ్వడం లేదు కదా అనే విషయాన్ని అధికారులు స్పష్టంగా తెలియపరుస్తున్నారు అని కార్మికులు చెప్పుతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - తూర్పు గోదావరి : ప్రజా సమస్యల పరి ష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్ర మం అక్టోబర్ 13వ తేదీ సోమవారం యథాతథంగా నిర్వహిం చబడుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా తమ డివిజన్, మం డల కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాల యాల్లోనే అర్జీలు అందజేయ వచ్చని కలెక్టర్ సూచిం చారు. ఫిర్యాదుల సమర్ప ణకు 1100 టోల్‌ఫ్రీ నంబర్ లేదా meekosam. ap.gov.in వెబ్‌సైట్ ఉపయోగించవచ్చని ఆమె తెలి పారు. ప్రభుత్వ పౌర సేవల కోసం 95523 00009 వాట్సాప్ గవర్నెన్స్ ను వినియోగించు కోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

మరో పదిహేనేళ్లు కూటమి ప్రభుత్వానిదే అధికారం

విశాలాంధ్ర - సీతానగరం : రాష్ట్రంలో మరో 15 ఏళ్లు డబల్ ఇంజన్ సర్కార్ కూటమి ప్రభుత్వందే అధికారం అని టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ అన్నారు. మండలంలో మునికూడలి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం వద్ద గల స్వర్గీయ మాజీ సీఎం నంద మూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ అంగ రంగ వైభవంగా రుడా ఛైర్మన్, రాజానగరం టీడీపీ ఇంచార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి సభ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ యువనేత పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. దీనిలో భాగంగా బొబ్బిల్లంక వంతెన వద్ద నుండి భారీ స్థాయిలో బైక్ ర్యాలీతో పరిటాల శ్రీరామ్ ని తీసుకొని వచ్చి మునికూడలి ప్రధాన కూడలిలో గజ మాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విగ్రహ ఆవిష్క రణ ముఖ్య అతిథి చేతులు మీదుగా విగ్రహ ఆవిష్క రణ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ విలేకరులతో మాట్లా డుతూ మరో పదిహేను ఏళ్లు డబుల్ ఇంజన్ సర్కార్ దే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారం అనడం లో సందేహం లేదు అని అన్నారు. కూటమి ప్రభు త్వర లో అన్ని వర్గాలు అన్ని ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి అనడంలో అతిశ యోక్తి లేదని అన్నారు. మా కుటుంబం మీద ఉన్న అభిమా నమే నేడు ప్రజలు మా మీద చూపిస్తున్నారని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఇవ్వని హామీ లను సైతం నెరవేరుస్తూ ప్రజా క్షేత్రంలో కూటమి ప్రభుత్వం చెరగని ముద్ర వేసింది అని అన్నారు. ఎన్టీఆర్ లాంటి మహనుభావుడు విగ్రహావిష్కరణ మా చేతుల మీదుగా జరగడం నా పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు కూటం ప్రభుత్వం రాబోయే రోజుల్లో అందించనుందని అన్నారు. టీడీపీ ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కనివిని ఎరగని రీతిలో విగ్రహావిష్కరణ చేయడం దీనికి ప్రజలు మద్దతు ఇవ్వడం చాలా ఆనందమని అన్నారు. పార్టీని స్థాపించిన ఎనిమిది నెలలలోనే అధి కారంలోకి వచ్చిన ఏకైక పార్టీ టిడిపి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు వెంకట రామారావు, కాండ్రు శేఖర్, మట్టా వెంకటేశ్వ రరావు, సర్పంచ్ సత్యవతి సత్య నారాయణ, తొర్రిగడ్డ ఛైర్మన్ శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు తిమ్మ రావు, తెలుగు యువత అధ్యక్షుడు గుడిపాటి శ్రీని వాసరావు, కందులబాబు, టీడీపీ సీని యర్ నాయ కులు వెంకటకృష్ణ చౌదరి, కాండ్రు శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య, వలవల రాజా, కాలగర్ల బాలకృష్ణ, బిక్కిన సతీష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికులకు ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ద్వారా భూములు, బ్యాంకు లోన్లు, ఇతర మౌలిక వసతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమ లలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించా లని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం రాజ మండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దీనిపై పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తీసుకు రాకపోవడం వలన యువతకు ఉపాధి లేక నిరుద్యోగులు పెరుగు తున్నారని వివరించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో 100 కు 75 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చ రించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని , కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తున్నవారిని కఠినంగా శిక్షించి , కల్తీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కు కేంద్ర, రాష్ట్రాలు అమలు చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ఉద్యోగాలలో ఎస్సీ బి క్యాటగిరికి చెందిన 1,633 మంది ఉద్యోగాలు పొందారని ప్రభుత్వం అమలు చేస్తున్న వర్గీకరణ విధానం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశామన్నారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఇతర సంక్షేమ పథకాలకు దారి మళ్లించకుండా ఎస్సీల సంక్షేమా నికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎస్సీలలో ఉన్న 59 కులాలకు ఉపయోగపడే విధంగా ఎస్సీ కార్పొరేషన్ నిధులు, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పిఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షులు తలారి నాని మాదిగ , కోనసీమ జిల్లా అధ్యక్షులు కన్నిపాముల శ్రీనివాస్ మాదిగ, తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి బొచ్చు చిన బాబు మాదిగ, గుంటూరు జిల్లా ప్రతినిధులు కళ్యాణి జార్జి మాదిగ, కందుల జార్జ్ మాదిగ, వెంకట్ మాదిగ, రామచంద్రాపురం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దోమ్మలపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహనకు ఆత్మ కమిటీ

విశాలాంధ్ర - పెదపూడి : రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కలిపించడం కోసమే ఆత్మ కమిటీలు అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్ఎన్ఆర్ కళ్యాణమండపంలో అనపర్తి డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఆత్మ కమిటీ చైర్మన్, మరో 24 మంది డైరెక్టర్లు ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన ఆత్మ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువ నేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు,సొసైటీ చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(దత్తుడు శ్రీను), బిక్కవోలు ఎంపిపి తేతలి సుమ, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదాన రెడ్డి, సర్పంచులు గొల్లు హేమ తులసి, గిరడా గంగాభవాని ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

బిహెచ్ఈఎల్ బస్సు రేట్లలో రాయితీ

విశాలాంధ్ర - అమలాపురం : అమలా పురం నుండి హైదరాబాద్(బిహెచ్ఈఎల్)కి నడపబడుతున్న అమరావతి ఏసీ బస్సు రేట్లలో 10% రాయితీ ప్రవేశపెట్టినారు. ఈ అవకాశం ఈ నెల అక్టోబర్ 31వ తారీకు వరకు అమలులో ఉండును. అమలాపురం నుండి ఎంజీబీఎస్ వరకు 1250 రూపాయలు అమలాపురం నుండి బీహెచ్ఈఎల్ వరకు 1300-00 రూపాయలు రాయితీతో టికెట్స్ అందుబాటులో ఉండును. అమలాపురం డిపో నుండి రాత్రి 08:30కి సర్వీస్ నం.2572, మరియు హైదరాబాద్ బీహెచ్ఈఎల్ నుండి రాత్రి 07:45 గంటలకు సర్వీస్ నం.2573 బయలుదేరును. ఈ సర్వీస్ విజయవాడ నుండి హైదరా బాద్‌కు నాన్‌స్టాప్ సర్వీస్‌గా నడుపబడుతుంది, కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్‌టిపి రాఘవ కుమార్ తెలిపారు.

ఏపీ ఆర్ఎస్ఏ డివిజన్ కమిటీ అధ్యక్షునిగా అశోక్ ప్రసాద్

విశాలాంధ్ర - అమలాపురం : అమలా పురం రెవెన్యూ డివిజన్ ఏపీ ఆర్ఎస్ఏ నూతన కమిటీకి ఎన్నికకు నేతృత్వం వహించిన రాష్ట్ర అధ్యక్షులు తహసీల్దార్ వాసా శామ్యూల్ దివాకర్ జిల్లా ఎబిటియుసి అధ్యక్షుడు కే సత్తిబాబు అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రెవెన్యూ డివిజన్ కమిటీ అధ్యక్షులు పి అశోక్ ప్రసాద్ (తహసీల్దార్, అమలాపురం) అసోసియేట్ ప్రెసిడెంట్ పి సునీల్ కుమార్ (తహసీల్దార్, మామిడికుదురు). ఉపాధ్యక్షులు పి వేణుగోపాల రావు (రెవెన్యూ ఇన్స్పెక్టర్, మామిడికుదురు), వి రామరాజు (రెవెన్యూ ఇన్స్పెక్టర్, సఖినేటిపల్లి), జనరల్ సెక్రటరీ వి రవికుమార్ (డిప్యూటీ తహసీల్దార్, కాట్రేనికోన), జాయింట్ సెక్రటరీలు : ఎంవి బాషా (అంబాజీపేట), జి సత్యవేణి (ఆర్డీవోఆఫీస్), కె వంశీ కోశాధికారి, ఎం వెంకటరమణ (అల్లవరం), సభ్యులు : ఆర్ యన్. మీరాసాహెబ్ వివియస్ యన్ విశ్వనాథ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారందరూ ఏపీ ఆర్ఎస్ ఆర్గనైజేషన్‌ను సమర్థవంతంగా ముందుకు తీసుకుపోగలరని ఆశాభావం వ్యక్తంచేస్తూ, ఎబిటియూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల జేఏసీ కో ఆర్డినేటర్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కామ్రేడ్ కె సత్తిబాబు ఒక ప్రకటనలో అభినందించారు.

నకిలీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ రేపు ఆందోళన



విశాలాంధ్ర - మండపేట : నకిలీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. రేపు తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కూటమి పాలనలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ అక్రమ మద్యం విక్రయాలను నిరసిస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నిరసన చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు మండపేట విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమై, అక్కడి నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తారని తెలిపారు.

తాగునీటి భద్రతకు ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రైవేటు మంచి నీటి కేంద్రాల తాగునీరు నోటికి రుచిగా ఉన్న ప్పటికీ, కొన్నాళ్ళకు ఆరోగ్య సమస్యలు తప్పవని గ్రామీణ తాగునీటి విభాగం ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్ రావు హెచ్చరించారు. ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని గుర్తు చేశారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, డిప్యూటీ ఎంపీడీవోల 7వ బ్యాచ్ శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం సరఫరా చేసే తాగునీటిని ప్రజలందరూ తాగేలా నాణ్యత ప్రమాణాలు మెరుగుపడాలని సూచించారు. మండల స్థాయిలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నీటిని సంరక్షించుకోపోతే 50 ఏళ్ల తర్వాత మనకు తాగునీరు దొరకదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తాగునీటి సరఫరాకు 10 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్టు ప్రభాకరరావు గుర్తు చేశారు. అధికారులు తాగునీటి సరఫరాను ప్రాధాన్య అంశంగా చూడాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కేఎన్‌వి ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఈ ఉమాశంకర్, శ్రీనివాస్, సురేష్, పెద్దాపురం డిఈఈ స్వామి, పెద్దాపురం ఏఈఈ శ్రీరామ్, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.

రహదారి, రవాణా సౌకర్యాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ఉద్దేశం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల కేంద్రమైన కాట్రేనికోన గ్రామంలో గేటు సెంటర్ నుండి పాత పోలీస్ క్వార్టర్స్ వరకు ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ నిధులు రు.64 లక్షలు అంచనా తో నిర్మించిన సిసి రోడ్డును ఆదివారం రాష్ట్రప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. గ్రామాల్లో రహదారి రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, ముమ్మిడివరం మార్కెటింగ్ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ, టిడిపి నాయకులు నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, నాగిడి నాగేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, ఆకాశం శ్రీనివాస్, తృవటపల్లి నాగేంద్రరావు, మంతెన శ్రీను రాజు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, విత్తనాలు బుజ్జి, ముదునూరి రామలింగరాజు, రంబాల రమేష్, బొమ్మిడి లింగేశ్వరరావు, పొద్దోకు బాలు, మాదే యోగేశ్వరి, మోకా అప్పాజీ, దండు ప్రోలు సత్యం, రంగారావు వర్మ, మోట మర్రి సత్తిబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎస్టీ పై అవగాహన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం పి వేమవరంలో టీడీపీ మండల అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో కూటమి సభ్యుల సమక్షంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, తనయుడు రంగనాథ్ హాజరు కాగా శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ప్రజలకు జీఎస్టీ పై అవగాహన కల్పించారు. అనంతరం ముసిరెడ్డి శ్రీరాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను, అలాగే పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయలు చినరాజప్ప పెద్దాపురం నియోజకవర్గంలో చేసిన పనుల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో వేమవరం గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని వ్యాఖ్యానించారు. అనంతరం నిమ్మకాయల రంగనాథ్ మాట్లాడుతూ చిన్న స్థాయి కుటుంబాలకు ఈ జీఎస్టీ లాభసాటిగా ఉంటుందన్నారు. ఇప్పటికే పెద్దాపురం నియోజకవర్గానికి 100 కోట్లు మన మీరా తీసుకువచ్చారన్నారు. వేమవరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సామర్లకోట మండల క్లస్టర్ ఇంచార్జ్ తోటనాగభూషణం మాట్లాడుతూ జీఎస్టీ ఉపయోగాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పనసపాడు గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ పెద్ద ఎత్తున సామర్లకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో చిలుకూరి రామకుమార్

విశాలాంధ్ర - రౌతులపూడి : రౌతులపూడి మండలం ఎన్ఎన్ పట్నం గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. కాకినాడ జిల్లా బిజెపి పూర్వ అధ్యక్షులు చిలు కూరి రామకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమాజ సేవ, ఏకత్వము, మరియు దేశభక్తి విలువలను ప్రతిబింబించే ఈ సమావేశంలో మాట్లాడుతు న్నందుకు చాలా గర్వంగా ఉందని రామకుమార్ అన్నారు. ఆర్ఎస్ ఎస్ సేవలు పలువురికి ఆదర్శం కావా లని ఈ సందర్భం గా ఆయన అన్నారు. ఈ శతాబ్ది ఉత్స వాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రామ్‌కుమార్ అన్నారు.

వీరుళ్లమ్మ తల్లికి రెడ్డి కార్తిక వన సమారాధన తొలి ఆహ్వాన పత్రిక

విశాలాంధ్ర - పెదపూడి : కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 2న కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్రి త్రినాథరెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పేరు ప్రఖ్యాతగా గావించిన అనపర్తి గ్రామ దేవత శ్రీ శ్రీ వీరు ళ్ళమ్మ అమ్మవారికి తొలి ఆహ్వాన పత్రికను అమ్మవారికి సమ ర్పించి, ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ మర్యాదలతో కోస్తాంధ్ర రెడ్డి ప్రతినిధులను స్వాగతం పలికారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాధ రెడ్డి, యువ జన విభాగం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రినాథ్ రెడ్డి పెదపూడిలో విలేక రులతో మాట్లాడుతూ అన పర్తి మండలం దుప్పల పూడి సబ్ స్టేషన్ వెనుక నేషనల్ వెంకటరెడ్డి మామిడి తోటలో వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుండి సాయం త్రం వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్య క్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులకు కూపన్ ద్వారా డ్రా తీసి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వంటి గృహ అవసరా లకు ఉప యోగపడే వస్తువు లను బహుమ తులుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ప్రతి నిధులు సత్తి వీర్రెడ్డి, తాడి రామ చంద్రారెడ్డి (బంకు చంద్రం) మేడపాటి వెంకట రమణారెడ్డి, సత్తి శ్రీనివాస రెడ్డి, లెఫ్ట్ శ్రీనివాస్ రెడ్డి, చింతా వీర్రాఘవరెడ్డి, గొలు గూరి వీర్రాఘ వరెడ్డి, వీరుళ్ళమ్మ దేవస్థాన కమిటీ ప్రతి నిధులు సత్తి రామకృష్ణారెడ్డి, మేడపాటి రామ కృష్ణా రెడ్డి, సత్తి రామారెడ్డి, మేడపాటి శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ఎస్ఈసి నెంబర్‌గా గోపు

విశాలాంధ్ర - పెద్దాపురం : వైఎస్సార్ సిపి స్టేట్ ఎగ్జక్యూటివ్ నెంబర్ (ఎస్ఈసి) సభ్యులుగా పెద్దాపురం మండలం తాటిపర్తి గ్రామ ఉప సర్పంచ్ గోపు సత్యకృష్ణ (మురళి) నియమితుల య్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ ఆది నుంచి పార్టీ కోసం శ్రమిస్తున్న మురళికి పార్టీలో అత్యున్నత స్థానం కల్పించిది. పార్టీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, పార్టీ పెద్దలు ఆశీస్సులు మెండుగా ఉండ డంతో మురళికి పార్టీలో మంచిస్థానం కల్పించారు. నియోజకవర్గంలో కో ఆర్డినేటర్‌లు మారిన పార్టీ కోసం మండలాని ఏక తాటి పైకి నడిపించిన నాయకుడిగా మురళికి మంచి పేరు ఉంది. నియోజకవర్గం స్థాయి లోను పార్టీ అభివృద్ధికి కృషి చెయ్యడంతో పార్టీ అధిష్టానం మురళినీ గుర్తించి రాష్ట్ర కార్య వర్గంలో మంచి సుముచిత స్థానం కల్పించిది. ఈ సందర్బంగా మురళి స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో బాధ్యతలు పెంచింద న్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహనరెడ్డి, రిజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యన్నారాయణ, జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, నియోజక వర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి కీలకం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రోజువారీ ఆహారపు అలవాట్లలోని లోపాల వల్లనే యువతలో గుండెపోటు మర ణాలు పెరుగుతున్నాయని ప్రముఖ శస్త్ర చికిత్స వైద్యులు డాక్టర్ శిరిగినీడి వీరభద్రరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కడుపు నింపుకోవడం కాకుండా, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుకోవచ్చని ఆయన సూచించారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. నేటి యువతలో అసహజమైన ఆహారపు అలవాట్ల కారణంగా గుండెపోటుతో అకాల మరణాలు సంభవిస్తున్నాయని డాక్టర్ వీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోగ్య అవగాహన కార్యక్ర మంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, సూర్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, శ్రీవాణి, కుమార్ యాదవ్, రేలింగి బాపిరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE RAMACHANDRAPURAM

E.A. No. 117 /2021 in
E.P.S.R.No. 1253 / 2021 in O.S. 32/2004
Between:
Mamidi Suryanarayana .... D.H.R
And
1) Ganapathi Rao Ramachandra Rao (Died)
2) Ganapathi Sitha Baye
3) Movaddi Swathi Pai
4) V Kamath Ramachandra Rao
... Respondents/Proposed Parties/ J.D.R.S.
3rd Respondents/Proposed Party/3rd J.D.R.

Movaddi Swathi Pai, W/o Not know, D/o late Ganapathirao Ramachandra Rao, aged 40 years, Hindu, r/o D.No.12-160, Koppisettivari Street, R/o Kothapeta, Kothapeta Mandal, E.G.Dt. Kothapeta PJCJ.

పై నెంబర్ గ్రంథంలో పై Ganapathi Rao Ramachandra Rao చనిపోగా అతని యొక్క ముఖ్య వారుసులుగా చేరిపించామని పై వాది / పీటిషనురు

పై నెంబర్ గ్రంథంలో పై వాది పరిహారం నిమితం పై కోర్టులో మీపై **E.A. 117 / 2021** ను దాఖలు చేయుగా, సదరు కోర్టు వారు అనేక పర్యయుములు నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందు పై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు తేది **22-10-2025**న వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఏదుట తేది. **22-10-2025**న ఉదయం **10-30** ని॥లకు హాజరు అయ్యి మీ తరుపున అక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేనియడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షమున ఉత్తర్యులు చెయ్యగలరు.

V.GOPALARAO, Cell : 9849146692
B. V.V.S.Kameswararao, Advocates,
Ratnampeta, RAMACHANDRAPURAM
రామచంద్రాపురం, తేది : 02-10-2025

రోడ్‌ను అభివృద్ధి చేయరూ..!

- ప్రమాదాలు నివారించాలి
- సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరంలో జగన్నాధపురం వంతెన నుండి అమ్మమ్మగాటి సెంటర్ వరకు నరసింహా రోడ్‌గా పిలువబడుతున్న రహదారి తక్షణమే పునః నిర్మాణం చేపట్టి ప్రమాదాలు నివారించాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమలాపురం, యానం రోడ్ రావులపాలెం, రామచంద్రపురం రోడ్ , ద్రాక్షారామ రోడ్ మీదుగా కాకినాడ చేరుకునే వాహనాలు జగన్నాధపురం రెండవ వంతెన మీదుగా వస్తాయన్నారు. జగన్నాధపురం వంతెన పై నుండి అన్నమ్మగాటీ సెంటర్ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో గుంతలు పూడ్చి తదుపరి రోడ్లు పునర్మాణం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఈ రోడ్ లో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు సైకిల్ పై హాజరయ్యే విద్యార్థులు ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం సాగిస్తున్నారన్నారు. కావున తక్షణమే జగన్నాధపురం వంతెన నుండి అమ్మమ్మ గాటి సెంటర్ వరకు గల రోడ్డు పునర్నిర్మాణం చేపట్టి ప్రమాదాలు నివారించాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

'రంగరాయ'లో బాలికల హాస్టల్‌ను పూర్తి చేసేందుకు చర్యలు

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రఖ్యాత మెడికల్ కాలేజ్‌గా ప్రసిద్ధి చెందిన రంగరాయ మెడికల్ కాలేజ్‌లో అసం పూర్తిగా ఉన్న హాస్టల్ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆదివారం 'రంగరాయ' పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డా ఆనంద్, డాక్టర్ వాడ్రేవు రవి తదితరులు క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తో భేటీ అయ్యి గర్ల్స్ హాస్టల్ దుస్థితిని వివరించారు, సౌకర్యాలు లేమి, శిథిలావస్థకు చేరిన గర్ల్స్ హాస్టల్ భవనాలను పరిశీలించి, నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచి పోయిన హాస్టల్ భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అప్పటికప్పుడు పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులతో కలిసి గర్ల్స్ హాస్టల్ భవనాలను పరిశీలించారు, అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన హాస్టల్ భవనాలను పరిశీలించి, గుత్తెదారులతో చర్చించారు. గత ప్రభుత్వం హయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాలు అసం పూర్తిగా నిలిచిపోయాయని ఎంపీ ఉదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న జి ప్లస్ 4 గర్ల్స్ హాస్టల్‌తో పాటు జి ప్లస్ 3 బాయ్స్ హాస్టల్‌లను పూర్తి చేసేందుకు సుమారు 35 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేయగా, ఏపీఎంఐడిసితో పాటు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అనంతరం అయన గర్ల్స్ హాస్టల్లో విద్యార్థినిలతో భేటీ అయ్యి హాస్టల్లో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఏ సమస్య వచ్చినా ఒక సోదరుడిగా మీకు అండగా ఉండడంతో పాటు, కూటమి ప్రభుత్వ హయాంలోనే హాస్టల్ భవనాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, రామ్ కోశాధ్యక్షులు డా ఆనంద్, డా వాడ్రేవు రవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లల మామిడాడలో మహిళా కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్

విశాలాంధ్ర - పెదపూడి : గొల్లల మామిడాడ డిఎల్ రెడ్డి డిగ్రీ కళాశాలలోని స్వర్గీయ పడాల ప్రహ్లాద రెడ్డి క్రీడా ప్రాంగణంలో ఆదివారం అధికవి నన్నయ యూనివర్సిటీ మహిళల కబాడీ జట్టు టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో ఉభయ గోదావరి జిల్లాల నుండి నన్నయ యూనివర్సిటీ పరిధి లోని 11 కళాశాల నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 14 మందిని విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేస్తారు. ఈ జట్టు అక్టోబర్ 29 నుండి నవంబర్ రెండు వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలోని వినాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి అంతర్ విశ్వ విద్యా లయాల మహిళా కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొం టుంది. ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొనే జట్టుకు పది రోజులపాటు డిఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణం లో కోచింగ్ క్యాంప్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గొల్లల మామిడాడ ఎడ్యుకే షనల్ సొసైటీ సెక్రటరీ ఒ కర స్పాండెంట్ డిఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ...క్రీడల అభి వృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తు న్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన "ఖేలో ఇండియా" క్రీడాకారుల పాలిట వరమని డిఆర్‌కె రెడ్డి పేర్కొ న్నారు. సభాధ్యక్షత వహించిన రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజి కల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారా యణ రెడ్డి మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ తర ఫున తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో జరిగే జాతీయ స్థాయి అంతర విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీల్లో విజయం సాధించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. నన్నయ యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టు టోర్న మెంట్ సెలక్షన్స్ నిర్వహించేందుకు తమ కళాశాలకు అనుమతి నిచ్చిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ "ప్రసన్నశ్రీ"కి ప్రిన్సిపల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. టోర్నమెంట్ ఆర్గనై జింగ్ సెక్రటరీ కె లోవరాజు మాట్లాడుతూ.. రెండు రోజులు పాటు జరిగే ఈ టోర్నమెంట్ , సెలక్షన్స్ నాకౌట్ కంలీగ్ పద్ధతిలో నిర్వహించబడతాయని, లీగ్ పోటీలు సోమవారం జరుగుతాయని లోవరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లలమామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ఎం రామచంద్రారెడ్డి, ప్రముఖ న్యాయవాది మండ రాజారెడ్డి, డిఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీనివాసరెడ్డి, డిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి త్రివేణి, ఆయా కళాశాలల అధ్యాప కులు పాల్గొన్నారు. జట్టు ఎంపికకు సంబంధించి యూనివర్సిటీ తరపున అబ్జర్వర్‌గా డాక్టర్ జీ ప్రమీల రాణి సభ్యులుగా వై సుధారాణి, ఎం వీరబాబులు వ్యవహరించారు.

హత్యకేసులో నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర - యానాం : యానాం పట్టణం లో శనివారం సంచలనం కలిగించిన వ్యక్తి దారుణ హత్య కేసుకు సంబంధించి నిందితుడ్ని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సిఐ అడలరసన్ తెలిపారు. ఈ హత్యకేసుకు సంబంధించి వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. కాజులూరు మండలా నికి చెందిన హతుడు త్రిపురశెట్టి నారాయణస్వామి 2022, మార్చి 12న యానాం గోపాల్నగర్ శివారు మోకా గార్డెన్స్‌కు చెందిన మోకా వెంకటేశ్వరరావు అలియాస్ బుజ్జిని అతని స్వగృహంలోనే కత్తితో పొడిచి హత్యచేసాడన్నారు. ఆర్థిక పరమైన లావాదేవీలు, చీటీలకు సంబందించి సొమ్ములు గూర్చి అప్పట్లో ఆ హత్య జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించి పుదుచ్చేరి కాలాపేట జైలులో శిక్ష అనుభవిస్తున్న నారాయణస్వామి ఇటీవలి కండిషన్ బెయిల్పై విడుదలయ్యాడన్నారు. ప్రతి రోజూ యానాం పోలీస్ స్టేషన్లో సంతకం పెడుతున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మోకా వెంకటేశ్వరరావు కుమారుడు మోకా ఆనందమూర్తి బైక్ పై వచ్చి స్థానిక న్యూకాంప్లెక్స్ సమీపంలో మెయిన్ రోడ్ పై ఉన్న తిపురశెట్టి నారాయణసామిని కత్తితో విచక్షణా రహితంగా 13 కత్తిపోట్లు పొడిచాడని దీంతో నారాయణ సామి మృతి చెందాడన్నారు. శనివారం మోకా ఆనందమూర్తి కుమారుడు, వెంకటేశ్వరరావు మనుమడు పుట్టినరోజు అని తెలిపారు. దీంతో తన తండ్రి ఉంటే మనుమడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగేవని కాని తన తండ్రి లేకుండా చేసిన నారాయణస్వామిజిపై కక్ష పెంచుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలో మద్యంతాగి రావడం..యాదృచికంగా మెయిన్రోడ్డుపై నిలబడి ఉన్న నారాయణస్వామిని విచక్షణారహితంగా కత్తితో పొడిచి చంపాడన్నారు. ఈ సందర్భంగా నిందితుడి నుంచి కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి సబ్ కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడ్ని పట్టుకున్న క్రైమ్ టీమ్ జాంటీ, దుర్గారావును అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సైలు పునీతరాజ్, సుబ్బరాజు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 పై వినియోగదారులకు అవగాహన - కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జీఎస్టీ 2.0 ద్వారా ధరల తగ్గింపుపై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించే లక్ష్యంతో నేటి నుంచి ఎనిమిది రోజులపాటు కొకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పించే విధంగా జీఎస్టీ శ్లాబులపై సం పూర్ణ అవగాహన కలిగించే లక్ష్యంతో ఈ నెల 13, సోమవారం నుంచి 19వ తేదీ వరకు కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాకినాడ దేవాలయం రోడ్డు లో పైడా చలమయ్య కళ్యాణమండపం లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 09 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్, అమ్మ కాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా అధి కార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ షాపింగ్ సంబరాల్లో జిల్లా వాసులు కుటుంబ సమేతంగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మంత్రి సుభాష్ ఇరువురికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - అమలాపురం, రామచంద్రపురం : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఒక వ్యక్తికి, మరో చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచి ఇరువురికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించి ఆపన్న హస్తం అందించారు. వివరాల్లోకెళితే రామచంద్రపురం మండలం వెల్ల సావరం గ్రామానికి చెందిన నందికొల్ల దుర్గాదేవికు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, అలాగే కె గంగవరం మండలం అద్దంపల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షల వీరబాబు గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. వీరబాబు మెరుగైన ఆరోగ్య చికిత్స నిమిత్తం రూ.20 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. కష్టకాలంలో ఉన్న తమ కుటుంబాలకు ఆసరాగా నిలిచిన మంత్రి సుభాష్‌కు ఇరు కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సేవా నిరతకి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులే...

విశాలాంధ్ర - కడియం : ఉత్తమ సమాజం తయారవ్వాలంటే అది ఉపాధ్యాయుల మీదే ఆధారపడి ఉంటుందని తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె వాసుదేవరావు అన్నారు. వరదా ఫౌండేషన్ బుర్రిలంక ఆధ్వర్యంలో కడియం, రాజమండ్రి రూరల్ మండలాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు, మెగా డీఎస్సీ 2025 లో ఎంపికైన ఉపాధ్యాయులు 40 మందిని ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఎన్ మురళీకృష్ణ అడిషనల్ ఎస్పీ పాల్గొని ఉపాధ్యాయులే సమాజాన్ని ఉద్ధరించే వారిని, ఉపాధ్యాయుడు సరిగా పనిచేయకపోతే ఆ సమాజమే పాడవుతుందన్నారు. జి భీమారావు, మధుసూదన రావు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, ఎంఈఓ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొని సన్మాన గ్రహీతలకు, నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గత నాలుగు సంవత్సరాలుగా పదవ తరగతి విద్యార్థులకు లక్షల రూపాయలు నగదు బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్న వరదా ఫౌండేషన్ ఆర్గనైజర్ వరద సుబ్బారావును పలువురు కొనియాడారు. సుబ్బారావు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు

- సబ్సిడీ రుణాల పథకం అటకెక్కనుందా?
- రుణాల కోసంఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత

విశాలాంధ్ర - కొవ్వూరు : నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పుకొచ్చింది. దీనిలో భాగంగా బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ తదితర కార్పొరేషన్ల పేరిట దరఖాస్తులను ఆహ్వానించి పట్టణాలలో మున్సిపాలిటీలకు, గ్రామాలలో అయితే మండల పరిషత్ కార్యాలయాలకు ఆన్లైన్ చేసిన తర్వాత అందచేయాలని ప్రభుత్వం ప్రకటించింది, ఈ మేర నిరుద్యోగ యువత ఎంతో ఆశలు పెంచుకొని దరఖాస్తులు ఆన్లైన్ చేసి మున్సిపాలిటీలకు, మండల పరిషత్ కార్యాలయాలకు అందజేశారు. దీనికి గాను మార్చి 25వ తేదీని చివరి తేదీన ప్రకటించారు. గడువులోపల దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను అందజేశారు. అనంతరం మున్సిపాలిటీలలో కమిషనర్లు, గ్రామానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఈ దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపించారు. ఎక్కడ వరకు బాగానే ఉంది ఆ తర్వాత దరఖాస్తుదారులు తాము ఎంచుకున్న బ్యాంకులకు దరఖాస్తుల వెళ్లడంతో బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణ చేస్తూ వచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో బ్యాంకులు ఇవ్వడానికి రుణాలు ఇవ్వడాన్ని పెండింగ్లో పెట్టింది. ఆ తర్వాత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి వాటిని స్వీకరించారు. ఎలా మొత్తం అన్ని కార్పొరేషన్ నుంచి దరఖాస్తులు స్థానిక సంస్థల ద్వారా బ్యాంకులకు చేరాయి గాని రుణాల మంజూరుకు నోచుకోక బ్యాంకుల వద్ద దరఖాస్తులు ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ల అధికారులను ఆరా తీస్తే సబ్సిడీ విషయంలో కార్పొరేషన్ల విషయంలో కొంతమేర తేడా ఉండడంతో రుణాల ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసిందని, త్వరలోనే ప్రభుత్వ నుంచి అనుమతి వస్తుందని చెబుతున్నట్లు సమాచారం. ఎంతో చేస్తుందని ఊహించి.. వైకాపా ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరల మనకి మంచి రోజులు వచ్చాయని నిరుద్యోగ యువత చాలామంది భావించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రుణాలకు బదులు కులాల పేరిట సంవత్సరానికి 15000 చొప్పున లబ్దిదారుల ఖాతాలో వేస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 50 శాతం సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామని, ఈ సొమ్ముతో చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకుని నిరుద్యోగ యువత ఉపాధి పొందుతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆర్భాటం ఘణం.. ఆచరణ శూన్యం అన్నట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని నిరుద్యోగ యువత దుమ్మెత్తి పోస్తోంది. అదేవిధంగా సబ్సిడీ రుణాల కోసం వ్యక్తిగత వయస్సు 60 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ణయించడంతో పేద మధ్యతరగతి వర్గాల ప్రజలు కూడా ఈ రుణాలపై ఆశలు పెంచుకుని దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం, అధికారులు ప్రకటించిన లక్ష్యాలకు పదింతలకు పైగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. ఈ నేపద్యంలో దరఖాస్తుదారుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లినట్లు అయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీ రుణాల విషయమై త్వరితగతిని నిర్ణయం తీసుకుంటే తమ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని రుణాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉపకార వేతనాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజమండ్రి : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన శెట్టి బలిజ సంఘీయ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీలో భాగంగా ఆదివారం స్థానిక గోదావరి గట్టుకు సమీపంలో ఉన్న త్యాగరాయ నారాయణ దాస సేవా సమితి కల్యాణ మండపం ప్రాంగణంలో సన్మాన సభ జరిగింది. సభకు రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. గత ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. ఈ రోజు ఈ ఉపకారం వేతనం ఒక ఆర్థిక సహ కారంగా కాకుండా ఒక ప్రోత్సా హంగా విద్యార్థులు భావించి అభి వృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ పోరాట పటిమ కలి గిన నగరం రాజమండ్రి అని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల ను ప్రోత్సహించే ఉద్దేశ్యం తో కుడుపూడి సత్తిబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషించ దగిన విషయమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీ అంటే బీసీ లని, బీసీ లంటే తెలుగు దేశం పార్టీ అన్నారు. బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందితేనే బీసీలు అభివృద్ధి చెందుతారని ఎన్ టీ ఆర్ బీసీ లకు రాజకీయాలలో అధిక ప్రాధాన్యం చేసారన్నారు. రాబోయే రోజుల్లో బీసీల అభివృద్ధికి కృషి చేస్తామ న్నారు. తన రాజకీయ ఎదుగుదలకు బీసీలు ఎంతగానో దోహదం చేసారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచే ఉద్దేశ్యంతో తామీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టుమని ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం లో పదవ తరగతి లో ప్రతిభ కనబరచిన 230 మంది విద్యార్థులకు 13 లక్షల రూపాయల ఉ కార వేతనాలు అందించారు. అంతకు ముందు ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంత కుమారి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురు మూర్తి, దెందులూరు జనసేన పార్టీ ఇంచార్జి వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల లక్ష్మి, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న శెట్టిబలిజ రాష్ట్రస్థాయి డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నూతన రహదారి నిర్మించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రహదారిపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేసి నూతన రహదారిని నిర్మించాలని సీతంపేట, తిరుమలాపురం, వీరన్న గూడెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలో సీతంపేట గ్రామం నుండి తిరుమలపురం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారయింది. గత ప్రభుత్వంలో ఈ రహదారిపై క్వారీ మెట్లలు వేసి గ్రావెల్ రోడ్డు నిర్మించి వదిలేసారే తప్ప దానిపై తారు రోడ్డు వేయకపోవడంతో రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చెరువులను తలపించే విధంగా రహదారి మారిందని, ఈ రహదారిపై ప్రయాణాలు కొనసాగించాలంటే పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ద్విచక్ర వాహనాల వారు రాకపోకలలో కూడా స్వల్ప ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, గర్భిణీ స్త్రీలు ఆటోలలో ప్రయాణించాల్సి వస్తే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని, సంబంధిత అధికారులు రహదారిపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేసి నూతన రహదారిని నిర్మించాలని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మనోహరం.. శ్రీనివాసుని బ్రహ్మోత్సవం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో కోనసీమ తిరుపతి వాడపల్లిలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు హనుమద్వాహన సేవ వాహనంపై పై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితులు ఆగమ శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలను మేళతాళాలు, వేదమంత్రాలు,ఉదయం సుప్రభాత సేవ, నవనీత హారతి విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, స్వామికి విశేషార్చనలు, పారమాత్మిక ఉపనిషత్ పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకము, లక్ష్మితులసి పూజ, ప్రధాన హోమములు, నీరాజన మంత్ర పుష్పములు, సాయంత్రం ప్రధాన, నవగ్రహ హోమములు, 'లక్ష్మీ వెంకటేశ్వర మూలమంత్ర పూర్వక వెంకటేశ్వర హోమము'. ఈ కార్యక్రమాలను పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేత త్వంలో వేదపండితులు, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి టి మాధవి దేవి, మచిలీపట్నం జిల్లా జడ్జి పి పొందు రంగారెడ్డి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ విశేష పూజలు బ్రహ్మోత్సవ సేవల అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.